క్లుప్తంగా

ఆరోగ్య శ్రీపై అవగాహన కల్పించండి

వేమూరు: పేద ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య మిత్రలకు, కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్య శ్రీ పథకం అమలు తీరును ప్రతి కుటుంబానికి తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ బృందం లీడర్ బి.నీలిమదేవి, ఆరోగ్యమిత్ర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అమ్మవారిని చైత్ర మాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం రేపు

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు శ్రీనివాసపురంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో చైత్ర శుద్ధ పౌర్ణమి గురువారం వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోపీచంద్ తెలిపారు. బుధవారం శతకలశస్నపన జరుగుతుందన్నారు. కల్యాణం అనంతరం అన్న సంతర్పణ, స్వామివారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు.

8న చెన్నకేశవుని తిరుకల్యాణ మహోత్సవం

రేపల్లె: పేటేరు గ్రామంలో వేంచేసియున్న చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 8న శనివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీ భూ సమేత శ్రీ చెన్నకేశవ స్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్యాణ వేడుకలను తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాపట్ల: పిన్నిబోయినవారి పాలెంలో ఇటీవల తాటి చెట్టుమీద నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుడు ఉప్పాల సాంబశివరావు కుటుంబానికి కారంకి ఫౌండేషన్, గౌడ్స్ అండ్ గౌడ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించారు. కారంకి వెంకట శివ నారాయణ గౌడ్, వంగ రాముల గౌడ్, పీటా వెంకటేశ్వర్లు, కోసూరి శివకృష్ణ అందించిన ఆర్థిక సాయం రూ.10వేలను మంగళవారం మృతుడి భార్య శివపార్వతికి చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి కోసూరి శివకృష్ణ మాట్లాడుతూ ఎవరైన సాయం చేయగలిగే వారు 7036126935కు సంప్రదించాలని తెలిపారు.

నేడు ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

రేపల్లె: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

భట్టిప్రోలు: డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా.. జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో పెదలంక ఇందిరా నగర్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాల ఏర్పాటుకు శంఖు స్థాపన జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాపట్ల జిల్లా కీర్తి అజరామరం

- పద్యం పుట్టిన గడ్డ భావపురి
- ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటారు
- తొలి వసంత వేడుకల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి
- ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు



ఎస్పీ వకుల్ జిందాల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



భావన్నారాయణస్వామి దేవాలయం పొంగలి నివేదనలో ఎమ్మెల్యే కోన రఘుపతి, రమాదేవి దంపతులు, కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా కీర్తి అజరామరం అని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల జిల్లాగా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం బాపట్ల తాలుకా రైస్‌మిల్లర్స్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల, సెర్ప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రైస్ మిల్లర్స్ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎస్పీ వకుల్ జిందాల్ కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. బాపట్లను నల్లమడ జిల్లాగా ఏర్పాటు చేసేందుకు తన తండ్రి కోన ప్రభాకరరావు గతంలో విశేష కృషి చేశారని గుర్తుచేశారు. అదృష్టవ శాత్తు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో తన హయాంలో బాపట్ల జిల్లా ఏర్పడటం చాలా సంతోషంగా ఉందన్నారు. బాపట్ల అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు స్వీకరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పటు చేయటానికి తన తండ్రి ఎంతో కృషిచేశారని చెప్పారు. పద్యం పుట్టిన గడ్డగా, భారతాన్ని గట్టెక్కించిన సీమగా బాపట్లకు గుర్తింపు ఉందన్నారు. బౌద్ధానికి ఆయువు పట్టుగా, ఎర్రప్రగడ, శ్రీనాథుడు వంటి వారు నడయాడిన నేలగా బాపట్ల ప్రసిద్ధిగాంచిందని తెలిపారు. ఎన్నో బాలారిష్టాలను అధిగమించి సంవత్సర కాలంలోనే పూర్తిస్థాయి జిల్లాగా ఎదిగిందన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. జిల్లా ఏర్పడిన కొత్తలో పోలీస్ ప్రధాన కార్యాలయంలో అవసరాలకు అనుగుణంగా వస్తువులు లేవని, ఎమ్మెల్యే కోన రఘుపతి చొరవతో ప్రభుత్వం భవనాన్ని, నాలుగు ఎకరాల ఖాళీ స్థలాన్ని పోలీస్ శాఖకి కేటాయించడం జరిగిందన్నారు. ఈ ఖాళీ స్థలాన్ని పరేడ్ గ్రౌండ్‌గా తీర్చిదిద్ది ఆగస్టు-15, జనవరి-26 వేడుకలను నిర్వహించామన్నారు. విభజన అనంతరం బాపట్ల జిల్లా మెరుగైన స్థితిలో ఉందన్నారు. నేర నియంత్రణ, నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవడంలో బాపట్ల జిల్లా మొదటి మూడు స్థానాల్లో ఉందన్నారు. దీనికి కారణం జిల్లా పోలీసు సిబ్బంది, అధికారులు సమన్వయంగా పనిచేయడమేనన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎస్పీ వకుల్‌జిందాల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డబ్ల్యూజీకే మూర్తి, ఫోరం ఫర్ బెటర్‌బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు టీవీ రత్న గుప్తా, సెర్ప్ కార్యదర్శి సీహెచ్ పార్థసారథి, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సీహెచ్ నారాయణరెడ్డి శిరీష, కె. శివరాం ప్రసాద్, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు..

బాపట్ల జిల్లా తొలి ఆవిర్భావ దినోత్సవాలు వైభవంగా జరిగాయి. మేళ తాళాలు, కోలాటం, నెమలి నృత్య ప్రదర్శన, డప్పు కళాకారులు, వాయిద్య కళాకారుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. రథం బజారులోని శ్రీ భావనారాయణ స్వామి దేవాలయం వద్ద జరిగిన వేడుకలు అంబరాన్నంటాయి. సంప్రదాయ బద్ధంగా కలెక్టర్ కె.విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందల్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి కుటుంబ సమేతంగా శ్రీ భావనారాయణ స్వామికి పొంగలి నివేదించారు.





జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కళా జాత ప్రదర్శన



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రజా ప్రతినిధులు



కొమ్ము తలపాగాలతో ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే కోన రఘుపతి

ఘనంగా బాపట్ల జిల్లా ఆవిర్భావ వేడుకలు

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మంగళవారం బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ పాల్గొని, మాట్లాడారు. బాపట్ల జిల్లా ఏర్పడటంతో ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కామవుతున్నాయని తెలిపారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఎంపీపీ, అధికారులు మొక్కలు నాటారు. అనంతరం ఎంపీపీని సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోనూ జిల్లా ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించారు. తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.రాధారమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు కర్లపాలెం నేతలు

కర్లపాలెం: బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను, గ్రామ సచివాలయాలు మంగళవారం విద్యుత్‌దీపాలతో అలంకరించారు. బాపట్లలో జరుగుతున్న ఆవిర్భావ దినోత్సవాలకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.



తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, తహసీల్దారు

భట్టిప్రోలులో..ఆవిర్భావ వేడుకలు

భట్టిప్రోలు: తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏడాదిలో కీలక మార్పులు..

బాపట్ల: బాపట్ల జిల్లా ఏర్పడిన ఏడాదిలోనే అభివృద్ధిలో కీలకమైన మార్పులు కనిపించాయని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య పేర్కొన్నారు. బాపట్లలోని చీలురోడ్డు సెంటర్‌లో జిల్లా ఆవిర్భావం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోన రఘుపతి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చప్పవరపు బాలాజీ, సుంకల శ్రీను, మద్దిబోయిన శ్రీనివాసరావు, అక్కల కృష్ణారెడ్డి, మాధవి, పార్వతి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



కుచ్చెళ్లపాడు గ్రామంలో బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కుచ్చళ్లపాడు(వేమూరు): సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. కుచ్చళ్లపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాలనే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, సర్పంచ్ గాజుల వెంకట సుబ్బయ్య, పార్టీ నాయకులు తాడికొండ శ్రీనుబాబు, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వేమూరు సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్, తులసి భగవాన్ దాసు, రామా పవన్‌కుమార్, వేము రామరాజు, మాజీ ఎంపీటీసీ కనపర్తి సజ్జనరావు, గాజుల వీర రాఘవయ్య, మాజీ ఉప సర్పంచ్ పెరికల రోజా రాణి, గాజుల శ్రీనివాసరావు, తాడికొండ వీర రాఘవయ్య, గాజుల మోహన్, విష్ణు మొలకల వెంకట రెడ్డియ్య, బొల్లిముంత శ్రీనివాసరావు, బొల్లిముంత వెంకటేశ్వరావు, సర్పంచ్ వెల్లబాడు బుల్లియ్య, ఈపూరు ప్రసాద్, అలపర్తి రవి, తాడిబోయిన అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లలిత కుమారి



ఎంపీడీవో చంద్రశేఖరరావుతో షేక్ సలీమ్.. వేదికపై ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

భట్టిప్రోలు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీం, భట్టిప్రోలు సర్పంచ్ దారా రవి కిరణ్మయి విద్యుత్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను పలు అంశాలపై ప్రశ్నించారు. సుమారు రెండున్నర గంటల పాటు సమావేశం వాడివేడిగా జరిగింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో కాంటాక్టర్లు అడ్డదిడ్డంగా విద్యుత్ స్తంభాలు వేశారని, విద్యుత్ రీడింగులు సకాలంలో తీయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో డీజే బాక్సులు, మైక్ సెట్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి..దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద డీజే సౌండ్లు నిలిపి వేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జగనన్న కాలనీ గృహాలకు 14 స్టీల్ చువ్వల సరఫరాపై కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ అభ్యంతరం వ్యక్తం చేయగా.. 12, 10, 8 ఎంఎం చువ్వలు 15 ఇస్తామని ఏఈ రావూరి సౌమ్య సమాధానం ఇచ్చారు. భట్టిప్రోలు లే-అవుట్‌లో తాగునీటి పైప్‌లైన్ కోసం మండల పరిషత్ నిధుల కేటాయింపులో.. ఎంపీటీసీ సభ్యుల అనుమతి లేకపోవడంపై ఆయన ప్రశ్నించారు. నాసిరకం పైపులు, కాంట్రాక్టర్ల తప్పిదం వల్ల ప్రజలు నీటి కోసం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, మల్లోలు ఉషారాణి, సూపరింటెండెంట్ జలజ, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

రూ.1.33కోట్లతో నిర్మించిన రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి



రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని రహదారులను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుందామని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలో రూ.1.33కోట్లతో అగ్నిమాపక కేంద్రం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు వేసిన రోడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరును రహదారికి నామకరణం చేస్తున్నామని తెలిపారు. ప్రాధాన్యత క్రమంగా బాపట్లలో రోడ్ల విస్తరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణంపై ఎక్కువ దృష్టి సారించామని చెప్పారు. బాపట్ల అభివృద్ధికి అడిగిందేతడవుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయటం హర్షణీయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాగిత యర్రయ్య, ఇనగలూరి మాల్యాద్రి, చేజర్ల నారాయణరెడ్డి, షేక్.సయ్యద్ పీర్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, వెదురుపర్తి లక్ష్మణమూర్తి, బుల్లిరెడ్డి, చీరాల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం



మహిళలకు ఆసరా నగదు చెక్కు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



జగనన్న నువ్వే మా భవిష్యత్ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, తదితరులు


రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని రేపల్లె పట్టణంలోని సీతారామ యోగిని కల్యాణ మండపంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొని, మాట్లాడారు. మహిళలు స్వయం శక్తితో ఎదగాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, నూరు శాతం అమలు చేస్తున్నారని చెప్పారు. కుటుంబ సభ్యుడిగా.. ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించారని పేర్కొన్నారు. రుణ మాఫీ సాయం మూడో విడత రేపల్లె పట్టణంలో 664 పొదుపు గ్రూపుల్లోని 6,442 మంది సభ్యులకు రూ.5.56 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. అనంతరం మహిళలకు నగదు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించాలి..

రేపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు చేస్తున్న మంచిని గ్రామస్థాయి నుంచి వివరించాల్సిన బాధ్యత నాయకులపై ఉందని రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. ''జగనన్న నువ్వే మా భవిష్యత్'' కార్యక్రమంపై నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో మంగళవారం సాయంత్రం సీతారామ యోగిని కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమన్వయంతో పనిచేసి సీఎం వైఎస్ జగన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో విభేదాలు పక్కనపెట్టి గెలుపే ధ్యేయంగా పని చేయాలని నిర్దేశించారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు గ్రామ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి పర్యటించి...సంక్షేమాన్ని వివరించటంతో పాటు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చేసే మోసాలను తెలియజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, ఎంపీపీలు చింతల శ్రీ కృష్ణయ్య, మత్తి దివాకర రత్నప్రసాద్, మోపిదేవి విజయ నిర్మల హరనాథబాబు, జెడ్పీటీసీలు నర్రా సుబ్బయ్య, నాగలక్ష్మి, బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి చేయూత అభినందనీయం



పవర్ స్ప్రేయర్ అందజేస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళిక పథకంలో భాగంగా తుమ్మల పంచాయతీ నిర్మల్‌నగర్‌కు చెందిన 50 మంది రైతులకు భారతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్వీ సుబ్బారావు సహకారంతో పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పవర్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలను ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పంపిణీ చేశారు. జిల్లాకు చెందిన డాక్టర్ సుబ్బారావు ఏటా పేద రైతులకు ప్రోత్సాహిస్తూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 40 రకాల కొత్త వరి వంగడాలను కనుగొన్న ఆయన బాపట్లకు గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, భారతీయ వరి పరిశోధన సంస్థ అధికారి జస్వంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువు సమీపంలో డంపింగ్ యార్డు వద్దు

కర్లపాలెం: తాగునీటి చెరువుకు సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ కోరారు. మంగళవారం కర్లపాలెంలో సీపీఐ నాయకుల సమావేశం జరిగింది. సింగరకొండ మాట్లాడుతూ కర్లపాలెం పాత తుంగభద్ర సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును ఓ ప్రైవేటు వెంచర్‌కు మేలు జరిగే విధంగా తాగునీటి చెరువుకు సమీపంలోకి తరలించటం తగదన్నారు. గిరిజనుల శ్మశాన వాటిక కోసం గతంలో ఎన్నోసార్లు పోరాటం చేసినా డంపింగ్ యార్డును తరలించని.. అధికారులు ఇప్పుడు కొత్తగా వెంచర్ యజమానులకు మేలు చేసేందుకు తాగునీటి సమీపంలో డంపింగ్ ఏర్పాటు చేసి.. చెత్త వేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. చెరువు సమీపంలో డంపింగ్ ఏర్పాటు చేయటం వల్ల తాగునీటి చెరువు జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జేబీ శ్రీధర్, కరిముల్లా, కాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తుల కొంగుబంగారం రాజ్యలక్ష్మీ సమేత నృసింహస్వామి

- నేడు స్వామివారి రథోత్సవం
- హాజరు కానున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



అల్లూరు శ్రీ రాజ్యలక్ష్మీ సమేత నృసింహస్వామి దేవాలయం

పిట్టలవానిపాలెం): అల్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి రాష్ట్రంలో ప్రసిద్ధి చెందినది. దేవాలయానికి అవసరమైన వస్నీ స్వామివారే స్వయంగా సమకూర్చుకోవడం ఇక్కడి ప్రత్యేకత. స్వామి వారిని సేవించుకొన్న వారికి అన్ని బాధలు తొలగి..కోరిన కొర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీలక్ష్మీ నృశింహస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకటశివారెడ్డి తెలిపారు. నిజాంపట్నం ఓడరేవు నుంచి వ్యాపారానికి బయల దేరిన వ్యాపారుల ఓడలు క్షేమంగా తిరిగి వచ్చినందుకు.. 1,199లో స్వామివారికి ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. 1249వలో తిప్పయ్య శ్రేష్టి అను వ్యాపారి కంచు గంటను ఆలయానికి ఇచ్చారు. నేటికి ఆ గంట ఆలయంలో కనిపిస్తుంది.

రథం మోకు..

పూర్వం ఉన్న స్వామివారి రథం 1980 సంవత్సరంలో అగ్ని ప్రమాదం సంభవించి పాక్షికంగా కాలపోయింది. గ్రామస్తులు, దాతలు కలిసి నూతన రథాన్ని నిర్మిచారు. మోకు కోసం ప్రయత్నిస్తున్న సందర్భంలో మరలా 2007లో రథానికి అవసరమైన మోకు సముద్రంలో కొట్టుకువచ్చింది. ఎంతో మంది రాజకీయ నాయకులు ఎన్నికల ముందు తమ బీ ఫాం తీసుకొచ్చి ఇక్కడ పూజలు చేయిస్తారు. 1956 సంవత్సరంలో బాపట్ల నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందిన మంతెన వెంకటరాజు కాలం నుంచి నేటి వరకు ఎన్నికైన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి వరకు నరశింహస్వామి కరుణ కటాక్షమే కారణమని పూర్తి విశ్వాసం.